

మానవ అక్రమ నివారణకు 'వాక్ ఫర్ ఫ్రీడమ్'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



'అంతర్జాతీయ మానవ అక్రమ నివారణ కోసమే వాక్ ఫర్ ఫ్రీడం' నిర్వహించినట్లు వక్తలు పేర్కొన్నారు. శనివారం తిరుపతి ఐటిఐ కళాశాలలో అంతర్జాతీయ ఎన్జీవో ఆస్ట్రేలియా ఏ 21, ది మూమెంట్ ఇండియా ముంబై సహాయ సహకారాలతో గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సౌజన్యంతో "పరివర్తన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బానిసత్వం ఇప్పటికీ ఉందని, ఆధునిక బానిసత్వంలో చిక్కుకొని ఉన్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 150 మందిలో ఒక్కరు బానిసలుగా ఉన్నారు. లైంగిక దోపిడీకి, మహిళలు బాలికలు చిన్నారులే బలవుతున్నారన్నారు. తిరుపతి డిఎస్పి వెంకట నారాయణ ,పరివర్తన స్వచ్ఛంద సంస్థ మానవ అక్రమ రవాణా కమిటీ మెంబర్ పి అమర్నాథ్, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి నరసింహులు పాల్గొన్నారు.

రబీకి రైతులను సన్నద్ధం చేయాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రబీకి రైతులను సన్నద్ధం చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య సూచించారు. స్థానిక ఏపీ సీడ్స్ సమావేశ మందిరంలో శనివారం డివిజనుస్థాయి రైతు సేవ కేంద్రాల సిబ్బంది శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిలో రకాల ఎంపిక నుండి, నారు పెంపకం, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సలహాలు అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచి, రసాయన ఎరువులు, కలుపు మందుల వాడకం తగ్గించాలని తెలిపారు. రసాయన కాలుష్యాల నుండి నేలలను కాపాడి, భావితరాలకు ఆరోగ్యమైన భూమిని అందించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు సమద్ధిగా కురుస్తున్న తరుణంలో రైతులను సకాలంలో రబీ సాగుకు సన్నద్ధం చేయాలని సూచించారు. రబీ కాలంలో ఆర్.ఎన్.ఆర్ 15048, కె.ఎన్.యం. 733, బి.పి.టి. 2841(బ్లాక్ రైస్), 3082 ,ఎన్.ఎల్.ఆర్ (34449), నెల్లూరు ధన్యరాశి రకాలు సాగుకు అనువైనవిగా తెలిపారు. ఆర్. ఎన్. ఆర్. 15048 రకాన్ని నవంబర్ రెండో వారం పైన నారు పోసుకొని డిసెంబర్ 15 లోపు నాట్లు వేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వర్ రెడ్డి వరి, వేరుశనగలో చేపట్టవలసిన సమగ్ర కలుపు నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం శిక్షణ ముగింపులో, గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బందికి టెస్టు నిర్వహించి, ఏరీస్ సంస్థ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఏడీఏ రమేష్ బాబు, ఏవోలు వేణుగోపాల రావు, సూర్య ప్రకాశ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మురళి, షణ్ముగం పాల్గొన్నారు.

నిబంధనలు... పక్కాగా అమలు చేయాలి

సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ అన్నారు. శనివారం తిరుపతి నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ ఎన్.మౌర్య ఆధ్వర్యంలో సఫాయి కర్మచారిల సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేశన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు ఏమేరకు చెల్లిస్తున్నారు. ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు అనే విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా సరైన సమయంలో జీతాలు ఇచ్చేలా చూడాలన్నారు. పీఎఫ్, ఈ ఎస్ ఐ వంటి వాటి గురించి కార్మికులు అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. తరచూ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. లీడ్ బ్యాంకర్లతో చర్చించి ఎటువంటి పూచీకత్తు లేకుండా కార్మికులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఎటువంటి సమస్యలు ఉన్నా కమిషనర్ ను కలసి తెలపాలని, లేకుంటే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చైర్మన్ అన్నారు.

కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ అన్ని సౌకర్యాలు చట్టబద్ధంగా కల్పిస్తున్నామని అందులో ఎటువంటి అలసత్వం లేదని, మస్టర్ గదులు తక్కువగా ఉన్నాయని, స్థల పరిశీలన చేసి త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా మహిళా అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేక గదులు కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్మికులకు కావాల్సిన యూనిఫాం, చెప్పులు, రక్షణ కవచాలు అందిస్తున్నామని చెప్పారు. విధుల్లో పాటించాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పిస్తూ, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, తుడా కార్యదర్శి వెంకట నారాయణ, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, తుడా సెక్రటరీ రాధిక, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు. శనివారం సాయంత్రం స్విమ్స్‌లోనూ కమిషన్ విచారించింది.

శ్రీరామ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన బహుళ జాతి కంపెనీ బిగ్ వర్క్స్ చే ఇంజనీరింగ్ ఆఖరు సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను కళాశాల యాజమాన్యం నిర్వహించింది. ప్రాంగణ ఎంపికల ప్రక్రియలో మొదటగా విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ ఎంపికలలో కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వార్షిక వేతనం నాలుగు లక్షల రూపాయలతో ఉద్యోగ అవకాశాలను పొందారని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి కోర్సు పూర్తయ్యేలోపు ఉద్యోగ అవకాసం కల్పించడమే లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి. విష్ణువర్ధన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని రుయా ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాయలసీమకే తలమానికమైన రుయాలో 1268 పడకలకు నాలుగవ తరగతి పర్మినెంట్ ఉద్యోగులు 40 మంది, ఆప్కాస్ 4వ తరగతి ఉద్యోగులు 45 మంది మొత్తం 85 మందే ఉన్నారని, ఈ కారణంగా తీవ్రమైన పనిభారం ఉద్యోగులపై పడుతోందని రుయా ఉద్యోగుల సంఘం (యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్) అధ్యక్ష కార్యదర్శులు ముని చంద్ర, నరసింహులు, సలహాదారు గురవయ్య జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి రుయా యాజమాన్యానికి పలుమార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోలేదని, అనివార్యమై జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ కోర్టులో వ్యాజ్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని, ఆ సమస్య పరిష్కారానికి యంత్రాంగం సీరియస్‌గా ప్రయత్నిస్తోందని, నవంబర్ నాటికి కొత్త రిక్రూట్మెంట్ పూర్తి చేసి పని భారం తగ్గిస్తామని, ఉద్యోగులకు అండగా ఉంటామని, అంకితభావంతో పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ స్పందనకు యూనియన్ నేతలు హర్షం తెలియజేశారు. నాయకులు కాంచనమాల, హరి కుమార్, రాధ, కుమారి దేవి, రమేషు, ముని వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.





జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

స్వచ్ఛ ఆంధ్రా దిశగా పనితీరు

మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ మెరుగైన సేవలు అందించాలని, ప్రతి మున్సిపాలిటీలోనూ పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, స్వచ్ఛ ఆంధ్ర దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపరెడ్డి మౌర్య, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పనిచేసి, నీటిశుద్ధి ప్లాంట్లు, డంపింగ్‌యార్డులు, సంపద కేంద్రాలు తదితర పనులు, భూసంబంధిత పెండింగ్ అంశాలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సాలిడ్ వేస్ట్, వెట్ వేస్ట్ సక్రమంగా అమలు కావాలన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బయో మిథనాల్ ప్లాంట్, సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ జాగ్రత్తగా అప్రమత్తంగా నిర్వహణ ఉండాలని సూచించారు. సుయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ తూకివాకం, ఎస్టీపీ ఫైటోరిడ్ టెక్నాలజీ ప్లాంట్ తదితరాలు అమలు తదితర అంశాలపై మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వివరించారు. వెంకటగిరి ఈఎల్ఎస్ఆర్ నిర్మాణానికి సంబంధించిన భూ సమస్య పరిష్కారమైందని కమిషనర్ తెలిపారు. అలాగే గూడూరుకు సంబంధించి సబ్ కలెక్టర్ వారితో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు కలెక్టర్ సూచించారు. పుత్తూరు 2 ఎస్టీపీలు, ఒక (ఎన్ఎస్ టి) నేచురల్ సుయెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, వెంకటగిరి, సూళ్లూరుపేట డంపింగ్ యార్డ్ అంశంపై, శ్రీకాళహస్తి ఎస్టిపి నిర్మాణానికి సంబంధించిన అంశాలను సంబంధిత రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, జెసి గారు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్ నేపథ్యంలో సంబంధిత మునిసిపల్ స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ ఆచరణాత్మకంగా అమలు అయ్యేలా ఉండాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర దిశగా ప్రతి మునిసిపాలిటీ పనితీరు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, నాయుడుపేట కమిషనర్ షేక్ ఫజురుల్లా, గూడూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూలో వర్షం వస్తే చిత్తడే

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంధ్ర బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్నటువంటి ఏటీఎం సెంటర్ ఎదురుగా ఉన్న రోడ్డుమీద వర్షం వస్తే పెద్ద నీటి కుంట చెరువును తలపిస్తుంది. ఎస్వీయూలోని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు అనేక రకాల పనిమీద యూనియన్ బ్యాంకు కోసం, ఇతర కార్యకలాపాల కోసం వస్తూ పోతూ ఉంటారు. ఎస్వీయూ బోధనేతర సిబ్బంది గహాలు, ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి సముదాయం కూడా ఈ రోడ్డు పరిసర ప్రాంతంలోనే ఉన్నాయి. ఇంజనీరింగ్ మహిళా విద్యార్థులకు కళాశాలకు వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి. వర్షాకాలం వచ్చిందంటే చాలు దోమలు స్వైరవిహారం చేస్తుంటాయి. పలుమార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా, ఉన్నతాధికారుల దృష్టికి విద్యార్థిసంఘాల నాయకులు తీసుకెళ్లినా సమస్యను సీరియస్‌గా తీసుకునే పరిస్థితి లేదు. చూసేవారికి 'గుంతే'గా అన్నట్లు ఉంటుంది. అయితే వేలాదిమంది నడిచే ప్రాంతంలో ఆ గుంత వల్ల ఎన్ని అగచాట్లో ఆ విద్యార్థులకే తెలియాలి. కొద్దిపాటి వర్షానికే మహాగుంట మురుగునీటితో చెరువును తలపిస్తుంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి క్యాంపస్‌లో గుంతలు లేకుండా చూడాల్సి ఉంది.



'సామాన్యులకు ఇసుక ఉచితం'పై హర్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తెస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని టీడీపీ బీసీ విభాగం నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు, ఎడ్లబళ్లలో నదులు, వాగులు, వంకల నుంచి ఎవరైనా ఎంత ఇసుక కావాలంటే అంత తీసుకుని వెళ్లవచ్చని స్పష్టం చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రోజు ఉత్తర్వులు జారీ చేయడం, అలాగే 40 టన్నులకు మించి ఇసుక తీసుకెళుతున్నా అధిక లోడ్ పేరుతో జరిమానాలు విధించబోమని చంద్రబాబు నాయుడు స్పష్టం చేయడం నిజంగా పేదలకు గొప్ప వరమని క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రహ్మణ్యం బుజ్జి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, ఐటిడిపి తిరుపతి జిల్లా నాయకుడు చింత గింజల సునీల్, శివ, భాస్కర్, మణి, షేక్ జిలానీ, వంశీ, ప్రభాకర్ అన్నారు.

విశాలాక్షి నగర్లో పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్


మండలంలోని నారాయణపురం పంచాయతీ విశాలాక్షి నగర్ లో శనివారం అధికారులు పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా విశాలాక్షి నగర్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ప్రధానరోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు, బురద చేరడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది ఈ క్రమంలో సమస్యను స్థానిక ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లడంతో సత్వరమే స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి చెంచయ్య హుటాహుటిన విశాలాక్షి నగర్ లో పారిశుధ్యం పనులు చేపట్టి రోడ్డుకిరువైపులా మురుగు నీరు, బురదను తొలగించారు.

'అన్నమయ్య సంకీర్తన' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ లండన్ వారి ద్వారా వరల్డ్ రికార్డ్ సాధించాలనే సత్సంకల్పంతో నవంబర్ 10 వ తేదీన జరిగే బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అనే అన్నమయ్య సంకీర్తనకు 2024 మందితో సామూహిక కోలాటం సంబంధించినటువంటి పోస్టర్ ను జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం విసి ప్రొ.జి.యస్.ఆర్ కష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మముక్కటే పర బ్రహ్మమొక్కటే అనేటటువంటి సంకీర్తన ద్వారా అందరూ సమానులే అనేటువంటి భావనను అన్నమాచార్యులు వారు ఈ సంకీర్తన ద్వారా ఆనాడే చెప్పడం జరిగిందన్నారు. ఈరోజు మనం అందరం కలిసి భావితరాల వారికి శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల భక్తి భావాన్ని కలిగి ఉండాలనేటువంటి విషయాన్ని తెలియజేసేటటువంటి ప్రయత్నం ఈ కార్యక్రమ ద్వారా చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే 9603050414 నెంబర్‌ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ డా.విశ్వనాథ్ రెడ్డి, తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ ఓబులు వెంకటరమణారెడ్డి, సెక్రటరీ బి.రవీంద్ర రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డా.టి.రామకష్ణారెడ్డి, సీనియర్ ప్రెసిడెంట్ జి.ఓం ప్రకాష్ రెడ్డి, శ్రీధర్ అకాడమీ సీఈవో ఎస్.లీలాకష్ణ స్వామి, అన్నమయ్య డాన్స్ అకాడమీ అధ్యక్షులు డా.సి.శ్రీ రామ్ బాబు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు మెగా చెక్కును అందిస్తున్న అప్సా నాయకులు

విజయవాడ వరద బాధితులకు 'అప్సా' సాయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విజయవాడ వరద బాధితులకు సాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల నుంచి విరాళాలను సేకరించింది. సేకరించిన విరాళాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అప్సా రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో రూ.64,02,854 వరద సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. వరద బాధితులకు సాయం చేసిన అప్సా కార్యవర్గాన్ని సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, అప్సా నాయకులు పాల్గొన్నారు.



ప్రయాణికుల 'బాట' గుంతల 'కోట'

ఈ రోడ్లకు మోక్షం లభించేనా..?
తూతూమంత్రంగా మరమ్మతులు
వాహనదారులకు తప్పని పా(ఫీ)ట్లు

ప్రజాశక్తి - కోట

జగన్ ప్రభుత్వం పోయి.. కూటమి అధికారంలోకి వచ్చింది.. వంద రోజుల అభివృద్ధి బాగుందని పాలకులు పెద్దఎత్తున ప్రచారం చేసుకున్నారు. అయితే జగన్ ప్రభుత్వ హయాంలో ఏవైతే రోడ్లపై గుంతలున్నాయో, అవే గోతులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ రోడ్లల్లో ప్రయాణించాలంటే నడుములు విరిగిపోయే పరిస్థితి.. అంతేకాదు, ఒకింత ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతలు పెద్దవయ్యాయి. నిధుల లేమితో ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. కనీసం కూటమి ప్రభుత్వంలో అయినా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. కోట క్రాస్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు ఫీట్లు చేయాల్సిందే. ఇంకో విషయం ఏమంటే ఈ మండలానికి ఆర్ అండ్ బి అధికారులు ఇన్‌ఛార్జిలుగానే ఉంటారు. గుంతలు మాత్రం శాశ్వతంగా ఉంటాయి.

మండలంలో కోట క్రాస్ రోడ్డు నుంచి బజారు వరకు, విద్యానగర్ నుంచి గూడలికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో నిండి ఉంది. పాలకులు గుంతలను చూస్తూ ఉండటమే తప్ప శాశ్వత పరిష్కారం ఆలోచించే పరిస్థితి లేదు. ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలిక ప్యాచ్ వర్కులతో అయ్యిందనిపిస్తున్నారు. ఈ ప్యాచ్ వర్కులుమరమ్మతులు చేసిన మూడు రోజులకే యథావిధిగా గుంతలు ఉండడంతో కాంట్రాక్టర్ల పనితీరుపైనా విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో కోట క్రాస్ నుంచి ఆర్టీసీ వరకూ, విద్యానగర్ నుంచి గూడలి గ్రామం చివరి వరకూ శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కోట మండలంలో 21 పంచాయతీలు ఉండగా వాకాడు, చిట్టమూరు మండల ప్రజలందరూ కోట మండలం మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. పనుల నిమిత్తం ప్రతిరోజూ కోట, విద్యానగర్ వైపు వస్తుంటారు. కోట ఆర్టీసీ బస్టాండ్ నుంచి క్రాస్‌రోడ్డు వరకూ ఒకటిన్నర కిలోమీటర్ దూరం అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లపై ఇలా అడుక్కో గుంత ఉండడంతో ప్రయాణికులు అందరూ అసౌకర్యానికి గురవ్వక తప్పడం లేదు. గత వైసిపి ప్రభుత్వంలో ఏడాది క్రితం తారు రోడ్డు వేశారు. కానీ కాంట్రాక్టర్ నాశిరకంగా వేయడంతో యథావిధిగా గుంతలతో దర్శనమిస్తోంది. అలాగే ఉత్తమ నెల్లూరు, సిద్దవరం గ్రామానికి వెళ్లే రోడ్డు, గూడలి గ్రామం, విద్యానగర్ నుంచి నెల్లూరుపల్లి, కొత్తపాలెం వెళ్లే రోడ్లన్నీ గుంతలతోనే ఉన్నాయి. మండలంలో ఆర్ అండ్ బి కార్యాలయంలో తాత్కాలిక ఇన్‌ఛార్జిలు ఎఇలు, డిఇలుగా ఉంటారే తప్ప, రెగ్యులర్ నియామకాలు ఉండటం లేదు. ప్రస్తుతం డిఇగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఢిల్లీ నుంచి, గుంటూరు నుంచి ఎఇగా యోహాన్ బదిలీపై వచ్చినట్లు ఆర్ అండ్ బి అధికారులు చెబుతున్నారు.

తూర్పున తుపాను 'ముంపు'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో తూర్పు మండలాలో అనేక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అనేక గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చే విమానాలను సైతం చెన్నయ్‌కు మళ్లించారు. తిరుమల ఘాట్ రోడ్డులలో కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. తిరుమలకు నడిచివెళ్లే శ్రీవారి మెట్టు మార్గాన్ని సైతం మూసివేశారు. సూళ్లూరుపేట సమీపంలో వాయుగుండం తీరాన్ని దాటడంతో జిల్లాలోని తూర్పు మండలాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పినా, తీరం దాటాక ప్రభావం తక్కువనే చెప్పాలి. అయినా వాతావరణం దీపావళి వరకూ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఈనెల 22న మరో అల్పపీడనం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది.

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి పుదిచ్చేరి సూళ్లూరుపేట మధ్య తీరాన్ని దాటింది. ఈ కారణంగా మూడు రోజుల పాటు జిల్లాలో ఎడతెరపి లేని వానలు కురిసాయి. ఈ నెల 14వ తేది మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షాలు 15, 16 తేదీలలో పూర్తిగా జడవానగా మారింది. గురువారం తెల్లవారుజామున తెరపిచ్చింది. ఈ వర్షాలకు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలామయం అయ్యాయి. చిరు వ్యాపారులు, రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికులు, పేద సామాన్య ప్రజలు బిక్కు బిక్కుమంటూ మూడు రోజుల పాటు ఇళ్లకే పరిమితమయ్యారు. తిరుపతిలోని మారుతినగర్, కొర్లగుంట, శివజ్యోతినగర్, కొత్తపల్లి, పూలవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్, ఉప్పంగి హరిజనవాడ, లక్ష్మీపురం కూడలి, ముంపు సమస్యలు నెలకొన్నాయి. వెస్చర్చి, డిఆర్ మహాల్, ఆర్‌సి రోడ్డు అండర్‌బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ దారుల్లో రాకపోకలు నిలిపివేశారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం కాల్వలు ఉధృతంగా ప్రవహించడంతో ఆ ప్రాంతాల్లో ఉన్న వారిని ఖాళీ చేయించి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు నగరంలో 17 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 995 కుటుంబాలకు చెందిన 2691 మందికి ఆశ్రయం కల్పించారు. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలు పునరవాస కేంద్రాలకు వచ్చేందుకు నిరాకరించడంతో సుమారు 300 మందికి వారి వారి ఇంటి వద్దన్న రెండు రోజులు పాటు ఆహారాన్ని అందించారు. సూళ్లూరు పేటలో అన్నదాతలు కుదేలయ్యారు. సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల్లో ఈ సీజన్‌లో 8వేల ఎకరాలు వరి పైర్లు సాగు చేశారు. ఇందులో 1500 ఎకరాలకుపైగా పంట కొట్టుకుపోయింది. అనేక చోట్ల పైర్లు నీటమునిగాయి. వెంకటగిరిలోని చిన్నన్నపేట వద్ద కల్వర్టు దెబ్బతింది. ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద ఉన్న కాజ్‌వేపైకి నీరు వెల్లడంతో రాకపోకలు నిలిపివేశారు. వరదయ్యపాళెం మండలంలోని సిఎల్ఎన్‌పల్లి, కలత్తూరు, మరదవాడ, అంబూరులో వరినారు నీటమునిగాయి. పొలాలు ఇసుక మేట వేసింది. తిరుమల ఘాట్‌రోడ్డులో కొండ చరియలు విరిగిపడడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. తిరుమలకు భక్తులు నడిచివెళ్లే శ్రీవారి మెట్టుమార్గంలో వర్షపునీరు ప్రవహించడంతో ఆ మార్గాన్ని తాత్కాలికంగా టిటిడి అధికారులు మూసివేశారు. కపిలతీర్థం పుష్కరణిలో వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుష్కరణిలోకి భక్తులను నిరాకరించారు.మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలువు ప్రకటించారంటే వర్షం ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణహాని తప్పడం గమనార్హం. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు, ప్రజలకు నష్టపరిహారాన్ని జిల్లా యంత్రాంగం అంచనా వేసి, వీలైనంత తర్వగా బాధితులకు అందజేసి, వారిని ఆదుకోవాలని రైతుసంఘాల నేతలు కోరుతున్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు చిట్టమూరు విద్యార్థినులు

ప్రజాశక్తి -చిట్టమూరు: మండల పరిధిలోని జెడ్‌పిహెచ్‌ఎస్ ఆరూరు విద్యార్థినులు పి ప్రశాంతి, పి శరణ్య రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైనట్లు సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం నిర్వహించే పోటీల్లో వారు పాల్గొన నున్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ ఎ జ్యోతి, పీడీ ఐ సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను వారు అభినందించారు.


రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - కోట : కోట మండలం గూడలి దళితవాడ సర్వారాబాద్ ఎంపిపి పాఠశాలను ఎంఈవో దారా మస్తానయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల చతుర్విధ ప్రక్రియలలో సామర్థ్యాలు, వారి తరగతి స్థాయి స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో మస్తానయ్య

ఈ కేవైసి మెగా డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గ్యాస్ ఏజెన్సీ యజమాని రవికుమార్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులోని గ్యాస్ వినియోగదారులు విధిగా ఈ కేవైసి మెగా డ్రైవ్ సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌పి గ్యాస్ ఆఫీస్, ఏరియా డెలివరీ బాయ్స్ ద్వారా కానీ ఈ కే వై సి చేయించుకోవాలని పుత్తూరు గ్యాస్ ఏజెన్సీ యజమాని రవికుమార్ తెలిపారు. పుత్తూరులోని తమ గ్యాస్ ఆఫీస్ (నగరి రోడ్ సుబ్బ బ్యాంక్ సైడ్) హెచ్‌పి గ్యాస్ ఆఫీస్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 వరకు ఈ కేవైసి చేయనున్నామని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ కంపెనీ కార్యాలయానికి రాలేని వారు వారి వారి ఏరియా డెలివరీ బాయ్ వద్ద ఈ కె వై సి చేయించుకోవచ్చునన్నారు. ఈ కె వై సి చేయించుకోని వారికి ప్రభుత్వ గ్యాస్ పథకాలు వర్తించవని స్పష్టం చేశారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి ఓటిపి ద్వారా మాత్రమే డెలివరీ చేస్తారని, గ్యాస్ సిలిండర్ తీసుకోకుండా ఓటిపి మీ ఏరియా డెలివరీ బాయ్‌కి చెప్పకూడదని సూచించారు. మీ ఏరియా డెలివరీ బాయ్‌ని సంప్రదించి సేఫ్టీ చెకింగ్ చేయించుకోవాలని గ్యాస్ ఏజెన్సీ యజమాని రవికుమార్ తెలిపారు. వివరాలకు 08577-262744, 08577-262244 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గ్రామాభివృద్ధే.. రాష్ట్రాభివృద్ధి

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్): గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండల కార్యాలయంలో మండల ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీలతో మండలంలోని పంచాయతీల అభివృద్ధి పై ఎమ్మెల్యే శనివారం సమీక్షించారు. పంచాయతీ సెక్రటరీలు బదిలీలు కావడంతో కొత్తగా వచ్చిన వారికి స్థానిక సమస్యలపై అవగాహనతో పాటు అభివృద్ధి పనులపై సమీక్షించారు. అధికారులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. తుమ్మలగుంట పంచాయతీలో అనధికారికంగా కేవీఎస్ అకౌంట్లు పేరుతో అకౌంట్లను నడుపుతున్నట్లు ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులను పక్కదారి మళ్లించడంతో గ్రామ అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల అభివృద్ధికి పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడి పలు సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి రూరల్ మండలంలో తాగునీరు, డ్రైనేజ్, సానిటేషన్, డంపింగ్ యార్డు, పింఛన్లు, మఠం భూములపై నివేదికలు ఇవ్వాలని కోరారు. మఠం భూములకు పంచాయతీ సెక్రటరీలు అనుమతులు ఇవ్వరాదని, గతంలో ఉన్న పంచాయతీ సెక్రటరీలు ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడంతో ఇష్టానుసారంగా అక్రమ కట్టడాలు కట్టడంతో వర్షం వచ్చినప్పుడు పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నానని వారికి ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మీకు ఎటువంటి సమస్య వచ్చినా నేను అందుబాటులో ఉంటానని అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుశీలా దేవి, ఎంపీఓ కె రామచంద్ర, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చట్టాలపై అవగాహన వుండాలి: జడ్జి

ప్రజాశక్తి-వెంకటగిరి: విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి వుండాలని జూనియర్ సివిల్ జడ్జి అనూష పేర్కొన్నారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని భద్రత కోసం ఏర్పాటు చేసిన చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎసిపి రమణయ్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న జడ్జి

ఉద్యోగులపై దాడి చేస్తే సహించం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వెంకటగిరి: ఉద్యోగులపై దాడిచేస్తే తమ కూటమి ప్రభుత్వం సహించదని వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఉద్యోగులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన నివాసం వద్ద శనివారం వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన వెంటనే సిఐకు ఫోన్ చేశారు. సచివాలయం ఉద్యోగిపై దాడిచేసిన కౌన్సిలర్‌పై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల కోసం పనిచేసే ఉద్యోగులపై దాడులకు దిగడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, మునీర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ఆర్‌అండ్‌బి రోడ్డు

- కుంచించుకుపోతున్న రహదారి
- గూడూరు, వెంకటగిరి మార్గంలో యథేచ్ఛగా అక్రమాలు
- స్పందించని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు–వెంకటగిరి మార్గంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు కబ్జా కోరల్లో చిక్కుకుంది. యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడు తుండడంతో ఈ మార్గం నానాటికీ కుంచించుకు పోతోంది. దీన్ని ఆర్‌అండ్‌బి అధికారులు చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని రోడ్డును పరిరక్షించాలని స్థానికులు కోరు తున్నారు.

గూడూరు – వెంకటగిరి రహదారిలోని చెన్నూరు కటలమ్మ గుడి ప్రాంతంలోని బస్ షెల్టర్ పక్కనే వున్న ఆర్‌అండ్‌బి రోడ్డుపై అక్రమార్కుల కన్ను పడింది. ఇప్పటికే పలువురు ఆర్‌అండ్‌బి స్థలాన్ని ఆక్రమించుకుని మట్టిని సైతం అక్కడ ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం చెన్నూరుకి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఆ స్థలాన్ని తాత్కాలిక దుకాణాలకు ఇచ్చి నెల అద్దెలు కూడా వసూలు చేసుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. త్వరలో అక్కడ శాశ్వత కట్టడాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసు కుంటున్నాడని తెలిపారు. ఇప్పటికే ఈ మార్గంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కబ్జాదారుడు తమను ఎవరు ఏమి చేయలేరని, స్థానిక నాయకులు, అధికారుల అండ వుందని బహిరంగంగా వాపోతున్నా డని స్థానికులు పేర్కొంటున్నారు.


ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బి రోడ్డు

స్పందించని ఆర్‌అండ్‌బి అధికారులు

ఆర్‌అండ్‌బి అధికారులకు దీనిపై పలు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బి అధికారులు నిద్రావస్థను వీడి ఆర్‌అండ్‌బి స్థలాలను రక్షించుకోవాల్సిన బాధ్యత వుందని తెలిపారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులదే బాధ్యత

అక్రమార్కుల చెరనుండి ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై వుంది. ఆర్‌అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బి స్థలాలను , రోడ్డును రక్షించాలి..

- శ్రీనివాసులు, సిపిఎం గూడూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి.

పాఠశాలా..పశువుల పాకా..?

ప్రహరీ లేక పాఠశాలకు భద్రత కరువు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఆరేటమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఎంపియుపి ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ లేక భద్రత కరువైంది. పాఠశాల పశువుల పాకలా మారింది. స్థానికులు పాఠశాల ముందే పశువులను చెట్టుకు కట్టివేస్తుండడంతో పాఠశాల విద్యార్థులకు భద్రత కరువైందని ఆరేటమ్మ కాలనీవాసులు వాపోతున్నారు. పాఠశాలలో విద్యార్థులు విరామ సమయంలో బయటికి వచ్చివెళ్లేటప్పుడు బయట కట్టేసిన పశువులకు భయపడాల్సి వస్తోందని, రోడ్డుపైకి వస్తే వాహనాలు రాకపోకలతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం వుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గతంలో 'నాడు నేడు'లో భాగంగా కొన్ని పనులు పూర్తయ్యాయి. ప్రహరీ ఏర్పాటు అర్థాంతరంగా ఆగిపోయింది. వీటిని పూర్తి చేసి పాఠశాల విద్యార్థులకు భద్రత కల్పించాలని ఆరేటమ్మ కాలనీవాసులు పలుసార్లు విద్యాశాఖ వారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇలాంటి దుస్థితి చోటు చేసుకుందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రహరీ ఏర్పాటు చేసి సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు భద్రత కల్పించి విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని లేకుంటే కార్యాలయం వద్ద నిరసన చేపడతామని విద్యార్థులు హెచ్చరించారు.


పాఠశాల ముందే పశువులను కట్టేసిన దృశ్యం

నిధులు వస్తే ప్రహరీ నిర్మిస్తాం..

గతంలో నాడు నేడు కింద నిధులు మంజూరు అయ్యాయి. వాటిలో కొంతవరకు మరుగుదొడ్లు , భవనానికి సంబంధించిన వాటికి సరిపోయాయి. మళ్లీ ప్రభుత్వం నుంచి నిధులు వస్తే ప్రహరీ పూర్తి చేస్తాం..

- తిరుమల రాజు, ఎంఈఓ.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(తిరుపతి రూరల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన తిరుపతి రూరల్ మండలం సిమల్లవరం పంచాయతీలో శనివారం చోటుచేసుకుంది. సి మల్లవరం దళితవాడకు చెందిన ఎస్ రామకృష్ణ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు సైతం కాలి బూడిదయ్యాయి. ఉదయం రామకృష్ణ, లక్ష్మీకాంతం దంపతులు ఉపాధి పనికి వెళ్లారు. అదే సమయంలో లక్ష్మీకాంతం ఇంటి నుండి మంటలు రావడం స్థానికులు గమనించి ఆపే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పూర్తిగా ఇల్లు దగ్ధమైందని వారు తెలిపారు. ఈ ఘటనలో 50 వేల రూపాయల నగదు, 10 సవరాల బంగారం, 50వేల విలువైన దుస్తులు, లక్ష రూపాయల విలువ గల మంచం, ఫ్రిడ్జి, మిక్సీ, గ్రైండర్, వాషింగ్ మిషన్ తదితర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో ఇంట్లో వస్తువులు మొత్తం కాలిపోయి బాధితులు కట్టుబట్టలతో వీధిన పడ్డారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

విద్యుత్ తీగలు తెగి భారీ ఆస్తినష్టం

- భయాందోళనలో అంబాకం గ్రామస్తులు
- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండలం ఆంబాకం గ్రామంలోని వెంకటేష్ పెరుమాళ్ వీధి మీదుగా వెళ్లే త్రీఫేస్ విద్యుత్ తీగలు తెగి పడడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు శనివారం ఉదయం నాలుగు గంటల సమయంలో వీధి మీదుగా వెళ్లే త్రీఫేస్ విద్యుత్ తీగలు తెగిపడి షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో మంటలు చెలరేగి ఆ వీధిలోని విద్యుత్ దీపాలు, 40 గృహాలకు చెందిన విద్యుత్ మీటర్లు, లైట్లు, స్విచ్ బోర్డులు, కేబుల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వెంటనే విద్యుత్ సరఫరాను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలో నిర్మించిన విద్యుత్ స్తంభాలలో గృహ విద్యుత్ వినియోగం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలతో పాటు వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే విద్యుత్ తీగలు ఇదే స్తంభాల మీదుగా తీసుకెళ్లడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ఈ సంఘటన జరిగి సుమారు 14 గంటలు తర్వాత విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని విద్యుత్ తీగలకు మరమ్మత్తులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అంతకు ముందు విద్యుత అధికారులు రాకపోవడంతో వారిపై అంబాకం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు తరచూ తెగిపడుతున్నా యని, శనివారం విద్యుత్ తీగ పడడంతో పని నిమిత్తం ఆ వీధి మీదుగా వెళ్లడానికి భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టానికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అంబాకం పంచాయతీ సర్పంచ్ సంగీత కనకరాజ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం చోటుచేసుకుని నష్టపోయిన గ్రామస్తుల గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంగీత కనకరాజ్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగలు తెగి మూగజీవాలు చనిపోయాయని, అప్పటి విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామని ఎలాంటి స్పందన లేదన్నారు. మళ్లీ ఇదే ప్రాంతంలో ఈ ప్రమాదం పునరావృత్తం కావడంతో సుమారు 43 కుటుంబాలకు చెందిన గృహాలు ఆస్తి నష్టం వాటిల్లిందని వ్యాఖ్యానించారు.


తెగి పడిన విద్యుత్ తీగ

సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని విఎస్‌పురం పంచాయతీ వేణుగోపాలపురంలో శనివారం 'పల్లె పండుగ' నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ శ్రీనివాస్ ప్రసాద్ చిన్నాయగుంట పంచాయతీలోని తహనగర్ సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దారు సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విఎస్ పురం, ఆర్ అనంతపురం, గోవిందప్ప నాయుడు కండ్రిగ, చిన్నాయి గుంట, పెద్ద పాలి వేడు, కనమనంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, నీరుపాకోట, గాజులు పెళ్లూరు, కుక్కంబాకం, కంచన పుత్తూరు, వేణుగోపాలపురం కాంపాలెం, కారని, నేరినికండ్రిగ పంచాయతీలలో సిసి రోడ్ల నిర్మాణానికి, పశువుల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు పంచాయతీ ఇందిర నగర్ గ్రామంలో ఎంపిడివో రషీ, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి డి ఇళంగోవన్ రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డి.ఇళంగోవన్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని పంచాయతీలలో కూటమి ప్రభుత్వం పల్లె ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తూ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ వైస్ సర్పంచ్ రవి , టౌన్ ప్రసిడెంట్ వాసు రెడ్డి, శ్రీనివాసులు రాయల్, బత్తారెడ్డి రజని కుమార్, ఢిల్లీ బాబు, ప్రతాప్ ఏపీఎం చంద్రకళ, ఏపీవో నాగభూషణమ్మ, పంచాయతీ సెక్రెటరీ రాధిక, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉదయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పల్లె పండుగ ద్వారా పంచాయతీలు ప్రగతి పథంలో పయనిస్తాయని నాయుడుపేట ఎంపీడీవో కె సురేష్ బాబు అన్నారు. నాయుడుపేట మండలం లోని గొట్టిప్రోలు పంచాయతీలో పల్లె పండుగను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిప్రోలు ఎంపిటిసి పల్లమాల రామిరెడ్డి, సర్పంచ్ పరసా వెంకటరమణయ్య, అరవ పెరమిడి మాజీ సర్పంచ్ సన్నారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఓ షీలా, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో ప్రతిపల్లెకు మౌలిక వసతులు కల్పించటమే ప్రభుత్వ ధ్యేయం అని సత్యవేడు టిడిపి మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సత్యవేడు మండలంలో శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో గ్రామ సర్పంచులు రూబెన్, గోవిందస్వామి ఆధ్వర్యంలో చిన్న ఈటిపాకం, పెద్దఈటిపాకం,కొల్లడం గ్రామాల్లోను, పివిపురం పంచాయతీలో రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కొండు బాలరాజు ఆధ్వర్యంలోను, కొత్త సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ జలజశ్రీ, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, లోకమ్మ, టిడిపి నాయకులు సురేందర్ రెడ్డి, శణ్ముగం, శశి నాయుడు, పివిపురం, ఉప సర్పంచ్ దాము రాజు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

దాడి కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేశామని గూడూరు టు టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 10 వ తేదీ గూడూరు పట్టణ పరిధిలోని ఇందిరా నగర్‌లో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అత్త మామలపై అల్లుడు , అతని బంధువులు దాడి చేసిన సంగతి విదితమే. బాధితుడు చెంచుకృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విసన్న పేటకు చెందిన నిందితులు సుబ్రహ్మణ్యం, విజయ్, భాస్కర్ , సురేష్ , రాజేష్ , నరసింహులు గూడూరు రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయం వద్ద శనివారం బెయిల్ కోసం లాయర్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యంరాజు తమ సిబ్బందితో కలిసి నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని సిఐ అభినందించారు.

ఆల్ ఇండియా టూరిస్ట్ బస్సులు ఢీ

- మెగా కంపెనీ సేఫ్టీ సిబ్బంది నిర్లక్ష్యం - ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్ : ఎదురెదురుగా వస్తున్న రెండు ఆలిండియా టూరిస్ట్ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ సంఘటన ఏర్పేడు మండలంలోని మేర్లపాక సమీపంలోని పుస్పిత్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో హైవేపై శనివారం చోటు చేసుకుంది. ప్రమాద స్థలాన్ని శ్రీకాళహస్తి ఎంవిఐ బి దామోదర్ నాయుడు స్వయంగా పరిశీలించి ప్రమాద కారణాలను గుర్తించారు. రాత్రిపూట వాహనాలను ఒకే లైన్లో ఎదురెదురుగా పంపుతుండడం వల్ల డ్రైవర్లు అయోమయానికి గురై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ ప్రమాదంలో రెండూ బస్సుల డ్రైవర్లు గాయపడ్డారని మిగిలిన ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని తెలిపారు. ఈ సందర్భంగా మెగా ఇంజనీరింగ్ కంపెనీ సేఫ్టీ ఆఫీసర్‌తో మాట్లాడామన్నారు. రాత్రిపూట అన్ని వాహనాలను వీలైనంత వరకు రెండు వైపులా పంపాలని పగలు మాత్రమే పనులు చేస్తున్న కారణంగా ఎదురెదురుగా అంటే ఒకే లైన్లో పంపితే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. మెగా కంపెనీ వారు ఈ ప్రతిపాదనకు అంగీకరించి తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ ప్రమాదాన్ని శ్రీకాళహస్తి డిపో మేనేజర్ బాలాజీ పరిశీలించారు.

కూల్ డ్రింక్ షాప్‌లో చోరీ

నగదు, శీతల పానీయాలు అపహరణ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: కూల్ డ్రింక్ షాపులో నగదు, శీతల పానీయాలు అపహరణకు గురైన సంఘటన దొరవారిసత్రం మండలంలో శనివారం చోటుచేసుకుంది. దొరవారిసత్రం మండల కేంద్రం జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఓ నిరుద్యోగి బద్ది చిరంజీవి కూల్ డ్రింక్, టీ దుకాణం నడుపుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి యథావిధిగా పగలంతా వ్యాపారం కొనసాగించి సాయంత్రం తాళం వేసుకొని వెళ్లాడు. శనివారం ఉదయం షాపు వద్దకు వచ్చి చూసి అవాక్కయ్యాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బంకు తాళం పగలగొట్టి రూ. 20 వేల నగదు, షాపులో ఉన్న పలు రకాల సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ అజయ్ కుమార్ సంఘటన పరిశీలించారు. నిందితులను పట్టుకుని న్యాయం చేస్తామని తెలిపారు. ఈ చోరీకి పాల్పడింది స్థానికులా? స్థానికేతరులా.. పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుర్తు తెలియని మృతదేహాన్ని పట్టణంలోని గోపాలవనం వద్ద స్థానికులు గుర్తించారు. పట్టణంలోని గోపాలవనం వద్ద చెంబేడు కాలువలో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు జేబులో లభించిన చిన్న డైరీ ఆధారంగా, ఆయన పేరు గుర్రప్ప అనీ, ప్రకాష్ అనే వడ్డీ వ్యాపారికి నెల నెలా నగదు కంతులు కడుతున్నాడని పోలీసులు గుర్తించారు. మృతుడు నలుపు, తెలుపు రంగులతో కూడిన చొక్కా, ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు టూ టౌన్ సీఐ వెంకటేశులు 9440900008 సెల్ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు.

సుబ్రహ్మణ్యం రెడ్డికి నివాళి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలోని ఇసుక తాగేలి గ్రామంలో నాయకుడు కన్నలి సుబ్రహ్మణ్యం రెడ్డి శనివారం మృతి చెందాడు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


సుబ్రహ్మణ్యంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘనంగా ప్రపంచ ఆహార దిన వారోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ :

జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో "ప్రపంచ ఆహార దిన వారోత్సవాలు" సందర్భంగా తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్ లో 'ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్స్ నియంత్రిద్దాం' అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా ఆహార భద్రత ప్రమాణాల అధికారులు మద్దిలేటి, నర్మదా మాట్లాడుతూ నేడు విక్రయిస్తున్న రెడీమేడ్, జంక్ ఫుడ్స్ ఆకర్షణీయంగా ఉండడానికి రంగులు రుచికి టేస్టీ సాల్టు, నిల్వ ఉండటానికి వాడే రసాయనాలు వల్ల పిల్లలకు ఊబకాయం, జ్ఞాపకశక్తి, కంటి చూపు తగ్గడం, చర్మవ్యాధులు, ప్రమాదకరమైన లివర్ క్యాన్సర్లు సంభవిస్తున్నాయన్నారు. ఇవి గుర్తుంచుకొని ప్రతి వినియోగదారుడు నాణ్యత లేని పదార్థాలను బహిష్కరించాలని కోరారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పి రాజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులలో ఆహార భద్రత హక్కు చాలా విశిష్టమైందని, నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయించే వారిని నిలదీసి ప్రశ్నించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం, ఓ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ మన శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో మెదడు ఒకటి అని, మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలు అవసరం అని, సరైన ఆహారం జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు పంటల్లో సస్యరక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: అధిక వర్షాల తర్వాత ఉద్యాన పంటల్లో సరైన సస్యరక్షణ యాజమాన్యం తప్పని సరిగా చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి శివకుమారి రైతులకు సూచించారు. టమాటా, వంగ, మిరప తదితర పంటలను క్షేత్ర స్థాయిలో వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ టమా టాలో నీరు నిలబడితే తక్షణమే బయటకు పంపి త్వరగా ఆరబెట్టాలని సూచించారు. ఒరిగిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొక్కల మొదళ్లచుట్టూ మట్టిని కప్పాలన్నారు. మొక్కలపై లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, పొటాషియం నైట్రేట్, ఐదు గ్రాములు కలిపి రెండు నుండి మూడు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అత్యధిక తేమ వల్ల కాయలు పగిలే అవకాశం వుంటే ముందు పంటలపై 1 గ్రాము బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచిం చారు. వాతావరణంలో అధిక తేమ వల్ల పంటను ఆశించే ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు పంటపై ఒక లీటరు నీటికి కార్బన్డజిమ్ఏ1 గ్రాము, మ్యాంకోజబ్ 2.5 గ్రాములు కలిపి చల్లుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించకుండా 10 లీటర్ల నీటిలో 25 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 30 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్, 1గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ మందులను కలిపి పిచికారి చేయడం మంచిదని సూచించారు. ఈ మందులతో పాటు జిగురును 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరానికి 20 కిలోలు యూరియా, 10 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు, ఇతర కూరగాయ పంటలపై నారు కుళ్లుతెగులు ఆశించకుండా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు 1 లీటరు నీటితో మొదళ్లను బాగా తడుపుకోవాలన్నారు. మొక్కలు తేరుకున్న తర్వాత సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఆకుమచ్చ కాయ, కుళ్లు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని, నివారణకు 2.5 గ్రాముల సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఏదైనా సమస్య వుంటే వ్యయసాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న మండల ఉద్యాన శాఖాధికారి శివకుమారి

మురుగు కాలువలకు మరమ్మతులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి అనూష్ బేకరీ ముందు ఎన్‌సీఆర్ నగర్ వద్ద పంట కాలువ వరకు ప్రధాన మురుగు కాలువల్లో శనివారం పూడిక తీసి మరమ్మతులు చేపట్టారు. డ్రైనేజి వ్యవస్థ సరిగా లేని కారణంగా వర్షాలు వచ్చినప్పుడు రోడ్లుపై వర్షపు నీరు చేరి ప్రయాణికులకు అసౌకర్యకరంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఎన్నో రోజులుగా డ్రైనేజిలు పూడిపోయి ఉండడంతో స్థానిక కోట పంచాయతీ పాలకులు స్పందించి శనివారం జేసీబీ సాయంతో డ్రైనేజిల పూడిక తీసి మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు పంచాయతీ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట ఎంపిటిసి షేక్ మొబీన్ బాష, పంచాయతీ సెక్రటరీ నెలవల రాజశేఖర్, సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

సర్వ జీవుల సేవే నిజమైన సేవ

- గరికపాటి రమేష్ బాబు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సర్వజీవుల సేవే నిజమైన సేవ అని, 'ఎదుటి వారి బాధ మీది అనుకుంటే అక్కడే దేవుడుంటారని, పశువులు, పక్షులు నిస్వార్థంగా వృక్షాలు బతికి ఉన్నప్పుడు ఫలాలను, పుష్పాలను, నీడను ఇస్తూ మరణించాక కూడా తన శరీరాలను వంట చెరకుగా ఉపయోగపడుతున్నట్లే జ్ఞాన వంతులైన మానవుడు కూడా ఇంకా ఎంతో సేవ చేయాలని తెలుగు విభాగం రీసెర్చ్ స్కాలర్ అధిపతి గరికపాటి రమేష్ బాబు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ఆయిన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యం వృథా కాకుండా ఆప్యాయతలను పంచేది అన్నారు. సేవా పరమార్థం అనే అంశంపై మాట్లాడుతూ విశ్రాంత జీవితంలోనూ అవిశ్రాంతంగా సంఘ సేవ చేస్తున్న పుత్తూరు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశలు, బంధాలు తగ్గించుకుంటూ ఒంటరి గా వుండక మంచి ఆలోచనలతో, ఇష్టమైన పనిలో నిమగ్నమైతే వృద్ధాప్యం గుర్తుకు రాదన్నారు. విశిష్ట మోటివేషనల్ వక్త నారాయణరావు జీవించడం ఒక కళ అనే అంశంపై వివరిస్తూ జీవితంలో ఎప్పుడూ ఆనందం తో, సంతోషంతో సంయమయం పాటిస్తూ జీవించాలన్నారు. ఈ సమావేశానికి బసవరాజు భాస్కర్ రాజు అధ్యక్షత వహించారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి మునిరాజుల శెట్టి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, యాభైవేల రూపాయలు విరాళం ఇచ్చారు . విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చిట్టీ మనోహర నాయుడు భోజన వితరణ చేశారు. ఈ సమావేశం లో సాహిత్య పిపాసి ఆర్‌సి కృష్ణస్వామి రాజు, గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి , జిల్లా బాధ్యులు కృపావరమ్మ, యుగంధర్ రాజు, సంఘం సభ్యులు, కుప్పయ్య, రామలింగం, రామమూర్తి ,చంద్ర శేఖర వర్మ, వెంకటకృష్ణమ నాయుడు, చిరంజీవి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గరికపాటి రమేష్ బాబు